క్లుప్తంగా

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



ఏటూరునాగారం: మండలంలోని గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో బుధవారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులను గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది చేపట్టారు. జ్వరాలు విపరీతంగా పెరుగుతుండడంతో శానిటేషన్ పనులపై దృష్టి సారించారు. లింగాపూర్‌లో దోమల నివారణ మందులు, పంప్యాపురంలో బ్లీచింగ్, మండల కేంద్రంలో చెత్తాచెదారం తొలగింపు, షాపెల్లిలో క్లోరినేషన్ పనులను చేపట్టారు. అంతేకాకుండా నిల్వ ఉన్న గుంతల్లో ఆయిల్‌బాల్స్‌ను విడిచారు. అలాగే నిత్యం దోమ తెరలను వాడాలని వివరిస్తున్నారు.

ఆస్పత్రి ప్రారంభం



వాజేడు: మండల పరిధిలోని పెద్దగూడెం గ్రామంలో పల్లె దవాఖానను సర్పంచ్ సమ్మక్క బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల ముంగిటకు ప్రభుత్వ వైద్యం తీసుకురావాలనే లక్ష్యంతో పల్లె దవఖానాలను ఏర్పాటు చేసిందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సాంబయ్య, ఎంపీటీసీ పార్వతి, వైద్యాధికారులు కొమరం మహేందర్, మధుకర్, వైద్య సిబ్బంది వెంకటరమణ, శ్రావంతి, సూర్య ప్రకాష రావు, కొటిరెడ్డి, నాగేంద్ర, లలిత తదితరులు ఉన్నారు.

‘ప్రభుత్వ తొత్తుసంఘాలతో చర్చలు సరికాదు’



ములుగురూరల్: అంగన్‌వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేపడుతుంటే ఉద్యోగులకు అనుబంధం లేని ప్రభుత్వ తొత్తు సంఘాలతో చర్చలు జరపడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లాకేంద్రంలో అంగన్‌వాడీలు మూతికి నల్లగుడ్డలను ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలు తమను పర్మనెంట్ చేయాలని, పీఎఫ్. ఈ ఎస్ఐ, ఆరోగ్యబీమా, ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేస్తున్న తరుణంలో అంగన్‌వాడీలకు దహన సంస్కారాలకు డబ్బులు కేటాయించడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో పద్మరాణి, మోక్షరాణి, భాగ్యలక్ష్మీ, రేణుక, అలివేలు, విజయ, అనసూయ, బాణమ్మ, కల్పన, మానస, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్ష

పలిమెల : తమ న్యాయమైన సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలు బుధవారం మూడో రోజు కొనసాగాయి. మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అంగన్‌వాడీలకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, తదితర సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు సత్యవతి, సుశీల, కిష్టబాయి, శివమ్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మాసోత్సవం

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని రామన్నగూడెంతండా అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ బుర్ర సరస్వతి ఆధ్వర్యంలో బుధవారం పోషణ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు చేసి, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్ మాట్లాడుతూ గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, పాలు, గుడ్లు, పప్పులను ఎక్కువ మోతాదులో తీసుకుని మాంసాహారాన్ని తక్కువ మోతాదులో తీసుకోవాలని సూచించారు. బిడ్డకు ఆరు నెలలు నిండగానే తల్లిపాలతో పాటు, అదనపు ఆహారాన్ని అందించాలన్నారు. కిశోర బాలికలకు రక్తహీనత రాకుండా ఉండేందుకు ప్రొటీన్స్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని, చిరుధాన్యాలతో ఆరోగ్యం సంపూర్ణంగా ఉంటుందని, కావున ప్రతీ ఒక్కరు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కల్లంలేనిచోట తునికాకు కోయించారు

- బోనస్ డబ్బుల కోసం కూలీల ప్రదక్షిణలు
- మాకేమీ తెలియదంటున్న అటవీశాఖ



అటవీశాఖ కార్యాలయం వద్ద తునికాకు కూలీలు

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి, మల్యాల, ఐలాపురం గ్రామాలకు అధికారికంగా తునికాకు కల్లం లేదు. కానీ కల్లెదారులు, తునికాకు కాంట్రాక్టర్ శ్రీకాంత్, ఖాజాపాషా అనే వ్యక్తులు కూలీలతో కోయించి అక్రమ మార్గంలో దానిని తరలించారు. అయితే తునికాకు కూలీలకు బోనస్‌డబ్బులు రావడం లేదని బుధవారం కార్యాలయానికి వచ్చిన కూలీలు వివరాలు, అడ్రస్‌లు ఏమి కూడా కార్యాలయంలో లేకపోవడంతో ఖంగుతిన్నారు. తాము తునికాకు కోసినప్పుడు ఎందుకు లేవని తునికాకు బాధితులు పూనెం శ్రీరాంమూర్తి, అండె భిక్షపతి, దబ్బగట్ల బొరయ్య, దబ్బగట్ల రవీందర్, గుమ్మడి శ్రీదేవి, దబ్బగట్ల సుశీల రేంజ్ అధికారి నరేందర్‌ను ప్రశ్నించారు. అయితే వన్యప్రాణి విభాగం కావడంతో 2016 నుంచి 2021 వరకు అనుమతి లేకపోవడం వల్ల అధికారికంగా అక్కడ కల్లాలు ఏర్పాటు చేయలేదని, కేవలం కాంట్రాక్టర్ చొరవతో కూలీలు కోసి నేరుగా కల్లేదారులకు అప్పగించారన్నారు. దీనివల్ల తునికాకు బోనస్ వస్తుందా రాదా అని చెప్పలేమన్నారు. అప్పటి వివరాలు కూడా తమ వద్ద లేవని చెప్పడంతో బాధితులు తలలు పట్టుకున్నారు. కొండాయి నుంచి నడిచి పడవ దాటి ఇక్కడి వరకు కూలీ పనులు వదులుకొని వచ్చి రోజు తిరిగిపోతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కల్లెదారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. జిల్లా అటవీశాఖ అధికారి స్పందించి కూలీలకు బోనస్ డబ్బులు వచ్చే విధంగా చూడాలని వేడుకుంటున్నారు.

అర్హులందరికీ బోనస్ ఇవ్వాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, కూలీలు

కన్నాయిగూడెం: అర్హులైన ప్రతి ఒక్కరికీ తునికాకు బోనస్ ఇవ్వాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ.అప్సర్ పాషా అన్నారు. బుధవారం ఏటూరునాగారంలోని అటవీ శాఖ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అప్సర్ పాషా ఆధ్వర్యంలో అటవీ శాఖ అధికారికి కార్యకర్తలతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అప్సర్ మాట్లాడుతూ.. కన్నాయిగూడెం ఏజెన్సీ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తునికాకు కోశారని, ప్రతి ఒక్కరికీ బోనస్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్, ఎస్సీ ఎల్ అధ్యక్షుడు సునార్కని రాంబాబు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు యాకూబ్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు శ్రీధర్, నాయకులు దుర్గారావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా జ్వరాల సర్వే



పప్కాపురంలో గోలీలు అందజేస్తున్న సిబ్బంది

ఏటూరునాగారం: మండలంలోని కోయగూడ ఎల్లాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని రాంనగర్ గ్రామంలో ఇంటింటా ఫీవర్ సర్వేను పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఆశ కార్యకర్త హేమలత, కారోబార్ రాజు బుధవారం చేపట్టారు. జ్వరం, దగ్గు, జలుబు ఉన్న వారికి మందులు అందజేశారు. వారి ఇంటిలో అనారోగ్య సమస్యలుంటే వెంటనే నమోదు చేసుకోవడంతోపాటు జ్వరం వచ్చి మూడు రోజులు అయినప్పటికీ తగ్గకపోతే వెంటనే పీహెచ్‌సీ, సీహెచ్‌సీకివెళ్లి పరీక్షలు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

బోదాపురంలో ఫీవర్ సర్వే

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బోదాపురం, సుడిబాక, పెరిక బజారులో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి జ్వర పీడితుల వివరాలను సేకరించారు. కాగా గ్రామాల్లో దోమల మందు స్ప్రెయింగ్ చేశారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి, రక్త నమూనాలను సేకరించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి భవ్యశ్రీ ఉన్నారు.

రాజ్యాధికారం సాధించుకోవాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: తెలంగాణలో 93 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఏకమై రాజ్యాధికారం సాధించుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ ములుగు జిల్లా ఇన్‌చార్జి సురేష్ మహరాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ప్రధాన రోడ్డుపై ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఏడు శాతం లేని అగ్రకులాలకు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, వైఎస్ఆర్‌టీపీల వైఖరిని వ్యతిరేకిస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ ధర్మ సమాజ్ పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆదేశాల మేరకు ఏటూరునాగారం మండల కమిటీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. 7 డిమాండ్లను విశారదన్ 2023 మే 15వ తేదీన లేఖలు రాయడంతో పాటు బహిరంగ ప్రకటన ఇచ్చి నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఏ పార్టీ నాయకుడి నుంచి సమాధానం రాకపోవడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అగ్రవర్ణాల కులాల నాయకులు బీసీ, ఎస్సీ, ఎస్టీలను అణగదొక్కుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో తరుణ్, రాజశేఖర్, సత్య నారాయణ, వంశీ, రాజు, తరుణ్, సాయి, సీతారామ్ ప్రవీణ్, ఎల్లేష్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ యమున

మంగపేట: ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించాలని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి చిన్నపాక యమున అన్నారు. మండలంలోని మల్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని మొట్లగూడెంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. శిబిరంలో 58 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. 16 మంది జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించి మలేరియా, డెంగీ, టైపాయిడ్ వైద్య పరీక్షలు నిర్వహించగా నెగిటివ్ రిపోర్టు వచ్చిందన్నారు. వైద్యశిబిరంలో పీహెచ్ఎన్ శైలజ, హెచ్‌వీ ముత్తమ్మ, ఏఎన్ఎం సీతమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

వెంకటాపురం(కె): వెంకటాపురం మేజర్ పంచాయతీలో పని చేస్తున్న పంచాయతీ కార్మికులుకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ బుధవారం మండల తహసీల్దార్ నల్లెట్ల సృజన్ కుమార్‌కు పంచాయతీ కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ భూమిలో పంచాయతీ కార్మికులు ఇల్లు నిర్మించుకునేందుకు స్థలం కేటాయించాలన్నారు. గత ఎన్నో సంవత్సరాలుగా పంచాయతీలో పనిచేస్తున్నామని తమకు ఇల్లు కట్టుకునేందుకు స్థలం చూపించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు లక్ష్మణరావు, బుచ్చిబాబు, సమ్మయ్య, జనగం శ్రీను సుందర్రావ్, నాగేశ్వరావు తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి



నియామక పత్రాలను అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె) రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును పెట్టాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల ఇన్‌చార్జీ వావిలాల సాంబశివరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని వీరభద్రవరం గ్రామంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సంద్బంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మాదిగలపై మౌనం వీడి వర్గీకరణ బిల్లును ఆమోదింపజేయాలని అన్నారు. హైదరబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప సభకు పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం వీరభద్రవరం, పాత్రాపురం గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. వీరభద్రవరం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా లంజపల్లి చంటిమాదిగ, కార్యదర్శిగా గుద్దేటి అరుణ మాదిగ గౌరవ అధ్యక్షునిగా వంకాయల రమేష్ మాదిగ, పాత్రాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వేల్పుల నవీన్, కార్యదర్శిగా సతీష్‌లను ఎన్నుకున్నారు.

దొంగిలించిన సొత్తు స్వాధీనం

టేకుమట్ల(రేగొండ): దొంగిలించిన వెండి, బంగారం స్వాధీనం చేసుకున్న రేగొండ పోలీసులు నిందితురాలిపై బుధవారం కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. రేగొండ మండలంలోని లింగాలలో గజ్జి సమ్మక్క ఇంట్లో మార్చి 5న చోరీ జరిగింది. దీంతో బాధితురాలు రేగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టిన ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి రేగొండ మండలంలోని చిట్యాల క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న పరకాల మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కేతిరి లక్ష్మిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా నేరం ఒప్పుకుని 30తులాల వెండి, నాలుగు తులాల బంగారం తిరిగి అందించినట్లు తెలిపారు.

యువత భవిష్యత్ నాశనం చేసిన కేసీఆర్

- ఎమ్మెల్యే సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

మంగపేట: యువత భవిష్యత్ నాశనం చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనను అంతమొందించడమే లక్ష్యంగా యువత పనిచేయాలని ఎమ్మెల్యే సీతక్క పిలుపునిచ్చారు. మండలంలోని మల్లూరులో బుధవారం నిర్వహించిన మండల యూత్ నాయకుల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సీతక్క హాజరై మాట్లాడారు. ఎన్నికలు దగ్గర పడగానే ఓట్లకోసం అధికార పార్టీ నాయకులు ప్రజల దగ్గరకు వస్తున్నారని తాను గెలుపుతో సంబంధం లేకుండా ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్నానని అన్నారు. ఓట్లకోసం అధికార పార్టీ చేసే గారడీ మాటలను నమ్మొద్దన్నారు. కష్టకాలంలో ఉన్న ప్రజలను చూడనివారు.. నేడు ఓట్ల కోసం గుమ్మాలు తొక్కుతున్నారని విమర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోవిందరావుపేట మండలం లక్నవరంలో ప్రధాన కాల్వలు దెబ్బతిన్నాయని వరి నాట్లు వేయకుండా రైతులు ఎదురుచూస్తుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం గండ్లు పూడ్చకుండా రైతులను విస్మరించిందన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇస్తానని చెప్పిన కేసీఆర్ నియోజకవర్గానికి 300 ఇళ్లు ఇస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, మండలంలో 2000పైగా బీసీలు, 1,000కి పైగా మైనార్టీ కుటుంబాలు ఉండగా బీసీ బంధు, మైనారిటీ బంధు 20, 30 కుటుంబాలకు ఇవ్వడం ఏంటని సీతక్క ప్రశ్నించారు. పోడు భూములకు పట్టాలు ఇస్తానని చెప్పి కనీసం 10 మందికి కూడా పట్టాలు ఇవ్వకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. రుణమాఫీ చేస్తానని నమ్మించి ఐదేళ్లు గడుస్తున్నా ఇంతవరకు మాఫీ జరగలేదని రైతే రాజు అని చెప్పిన ప్రభుత్వాలు రైతులను మోసం చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పోడు భూములతో పాటు భూమి సాగుచేసుకునే ప్రతి రైతుకు పట్టాలు ఇస్తామన్నారు. హామీలను నెరవేర్చకుండా ప్రజల సొమ్మును దోచుకుంటున్న బీఆర్ఎస్ పార్టీని గద్దె దించాలని తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవిచందర్ పాల్గొన్నారు.

చేరికలు

కమలాపురంలోని భగత్‌సింగ్ కాలనీ, ఎస్సీ కాలనీకి చెందిన సుమారు 40 మంది మహిళలు సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నూతనంగా పార్టీలోకి చేరిన వారిని ఎమ్మెల్యే సీతక్క పార్టీ కండువాతో సత్కరంచి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మండలంలోని రమణక్కపేటకు చెందిన మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ బాలకృష్ణ ఇటీవల అనారోగ్యానికి గురికాగా సీతక్క ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

ఆలయాల్లో పూజలు



పూజలు చేస్తున్న లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం: ఉమారామలింగేశ్వరస్వామి, సాయిబాబా ఆలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు బుధవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సుదర్శనస్వామి, రాజ్‌కుమార్, శివాలయం చైర్మన్ తాడూరి రఘు, ఎంపీటీసీ కోట నర్సింహులు, బీఆర్ఎస్ నాయకుడు ప్రదీప్‌రావు పాల్గొన్నారు.

‘సీతక్కపై ఆరోపణలు సరికాదు’

ఎస్ఎస్‌తాడ్వాయి: కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్కపై బీఆర్ఎస్ నాయకులు అసత్యపు ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకుడు లంజపెల్లి నర్సయ్య అన్నారు. సీతక్కపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను ఆయన బుధవారం తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారంలో ఉన్నా ప్రజాప్రతినిధులు స్థానిక సమస్యలపై ఏ ఒక్క రోజైనా.. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సందర్భాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య ఇటీవల సోషల్ మీడియాలో సీతక్కపై మాట్లాడటానికి ముందు మన స్థాయి ఏమిటో ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా లబ్ధిపొందిన విషయాన్ని గుర్తు చేసుకోవాలని హితవుపలికారు. అప్పటి ములుగు ఎమ్మెల్యేగా పని చేసిన వీరయ్య ఆధ్వర్యంలో చట్టం ప్రకారం పది ఎకరాల భూమి ఇప్పించిన విషయాన్ని మరిచిపోయి మాట్లాడడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీని అడ్డుపెట్టుకొని బలవంతంగా గిరిజనులు సాగు చేసుకుంటున్న పదిహేను ఎకరాల భూమిని ఆక్రమించుకున్నది వాస్తవం కాదా.. అని ప్రశ్నించారు. కరోనా సమయంలో జిల్లా స్థాయి ప్రజాప్రతినిధులు, మంత్రులు గ్రామాలను సందర్శించిన సందర్భాలు లేవన్నారు. కరోనా సమయంలో ప్రజాసేవలో నిమగ్నమై కరోనా బాధితులకు అండగా నిలిచి సాయం అందించిన సీతక్కపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. సీతక్కపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను మేధావులు, విద్యావంతులు, ప్రజాస్వామికవాదులు, ప్రజలు గమనిస్తున్నారన్నారు. సీతక్కపై ఆరోపణలను మానుకోవాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నివాళులర్పిస్తున్న ప్రభాకర్, పెసా మొబిలైజర్లు

మంగపేట: మండలంలోని చెరుపల్లి గ్రామానికి చెందిన పెసా మొబిలైజర్ అన్నెబోయిన సుమలత భర్త నరేష్ ఇటీవల మృతి చెందగా ఏటూరునాగారం ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ మండలంలోని 25 గ్రామ పంచాయతీల మొబిలైజర్లతో కలిసి బుధవారం పరామర్శించారు. నరేష్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రూ.12,500 సుమలతకు అందచేశారు. కార్యక్రమంలో పెసా కమిటీ మొబిలైజర్ల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు డబ్బుల ముత్యాలరావు, మడి శోభన్, మొబిలైజర్లు పాయం రమేష్, పూసం కార్తీక్, జిగట శ్రీనివాస్, తాటి విజయ్‌కుమార్, జబ్బ కరుణాకర్, చీమల సురేష్, పొదెం నాగేశ్వర్ రావు, మంకడి మహేందర్, చందా రమేష్, సోలం బాబు, సున్నం మధు, యాలం శ్రీను పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఆర్థిక సాయం

ఇటీవల మృతి చెందిన ఆటో డ్రైవర్ అన్నెబోయిన నరేష్ కుటుంబానికి తిమ్మంపేటకు చెందిన తోటి ఆటో యూనియన్ సభ్యులు రూ.5,400 బాధిత కుటుంబానికి అందచేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు చింతకింది ముకుందం, ప్రధాన కార్యదర్శి ముకుందం, యూనియన్ బాధ్యులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగుల భిక్షాటన

భూపాలపల్లి అర్బన్: విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు బుధవారం జిల్లా కేంద్రంలో భిక్షాటన చేశారు. కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న నిరహార దీక్షలు 13వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ ప్రధాన కార్యదర్శి తోకల వేణు మాట్లాడుతూ.. విద్యాశాఖలో కీలకంగా పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షులు రఘు, నాయకులు సాంబమూర్తి, ప్రసాద్, ప్రతాప్‌లు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు చాంద్ పాషా, మహేందర్, చల్ల సునీత, చంద్రకళ, సుదర్శన్, సంపత్, చంద్రమౌళి, కుమార్, హరీశ్, రాజు, తిరుపతి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీ



గొర్రెలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

భూపాలపల్లి రూరల్: మండల పశువైద్యాధికారి తిరుపతి ఆధ్వర్యంలో భూపాలపల్లి మండలంలోని గొర్లవీడులో లబ్ధిదారులకు రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈకార్యక్రమానికి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ, మండల ఎంపీపీ మందల లావణ్య ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా లావణ్య మాట్లాడుతూ.. అధికారుల సూచన మేరకు డీడీలు తీయాలన్నారు. ఈసందర్భంగా మండల పశువైద్యాధికారి తిరుపతి మాట్లాడుతూ రెండో విడత 100 మంది లబ్ధిదారులకు గాను 25 మంది డీడీలు తీయగా.. 24 మందికి గొర్రెల్ని పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తాటి కంటి శంకరయ్య, మాజీ ఎంపీపీ రఘుపతిరావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విద్యాసాగర్‌రెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ మామిడి రాజకుమార్, సభ్యులు బండి శ్రీనివాస్, లబ్ధిదారులు అనిల్, గౌడ మహేశ్, బూర్గుల రామస్వామి, బందరి సమ్మయ్య, బూర్గుల అశోక్, దొంగల ఐలుకొమురు, అన్న గోపయ్య, బండారి రవి, చరాల శ్రీకాంత్, కుమార్, సుధాకర్, గౌడ కొండయ్య, కాత్రావుల రాజబాబు, వెటర్నరీ అసిస్టెంట్ విజయ్, గోపాలమిత్ర రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

వాజేడు: చెరుకూరులో బుధవారం చేయూత స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ వారు గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మహేందర్ మాట్లాడుతూ.. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారంపై వివరించారు. చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాష్ మాట్లాడుతూ.. డెలివరీ సమయంలో రక్తం అవసరమైతే ముందుగా సమాచారం ఇస్తే తమ సంస్థ తరపున సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జయరామ్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274